క్లుప్తంగా

మానేరు కెనాల్‌కు గండి



పూడ్చివేత పనులు చేపట్టిన అధికారులు

ముస్తాబాద్‌: మండలంలోని గూడూరు వద్ద ఎగువ మానేరు ప్రాజెక్టు కెనాల్‌కు గండి పడింది. రెండు రోజుల క్రితం కెనాల్‌కు గండిపడడంతో నీటి సరఫరా నిలిపివేసినట్లు డీఈఈ రవికుమార్‌ తెలిపారు. గూడూరు నుంచి పోతుగల్‌, ముస్తాబాద్‌, తెర్లుమద్దివైపు సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో రైతులు ఆందోళనకు గురై, మానేరు కెనాల్‌ వెంట పరిశీలించగా గూడూరు శివారులో గండి పడినట్లు గుర్తించారు. అధికారులకు ఫిర్యాదు చేయడంతో, లష్కర్లు, సహాయకులతో గండి పూడ్చివేత పనులను చేపట్టామని ఏఈ వంశీకృష్ణ, వర్క్‌ఇన్స్‌పెక్టర్‌ రాజు తెలిపారు. పొలాలకు నీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

షీటీమ్‌ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏఎస్సై ప్రమీల

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం షీటీమ్‌ ప్రతినిధి ఏఎస్సై ప్రమీల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్‌ సెక్యూరిటీ, సోషల్‌ మీడియా దుష్ప్రభావంపై వివరించారు. హెచ్‌ఎం బండి ఉపేందర్‌, షీటీమ్‌ బృందం రమాదేవి, రిజ్వాన్‌, శేఖర్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి



సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

కోనరావుపేట: ఐదేళ్లుగా బదిలీల కోసం, తొమ్మిదేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని టీఆర్టీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్‌ అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలో టీఆర్‌టీఎఫ్‌ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా విద్యాధికారులు ప్రిఫరెన్షియల్‌ సర్టిఫికెట్లు సమర్పించిన వారిని జిల్లా వైద్యాధికారి సమక్షంలో మరోసారి పరీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు మహేశుని లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శి సుల్తాన్‌ రాజు, రాష్ట్ర నాయకులు ఆసాని అనిల్‌రెడ్డి, పోతుగంటి రమేశ్‌ పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం

• కూలేందుకు సిద్ధంగా లోలెవల్‌ కల్వర్టు • ఒకవైపు పూర్తిగా శిథిలం • కూలిన రాతి కట్టడం • ఊడిన పైపులు

బోయినపల్లి: పక్కన ఉన్న ఫొటో బోయినపల్లి–కొదురుపాక డబుల్‌ రోడ్డులో ఉన్న లోలెవల్‌ కల్వర్టు. ఈ కల్వర్టు ఎప్పుడూ కూలుతుందో అన్నట్లుగా ఉన్నా.. తప్పని పరిస్థితుల్లో ఆ వంతెనపైనే ప్రయాణం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు మధ్యలో సగభాగం పూర్తిగా చెడిపోయింది. కల్వర్టు కింద కొంతమేరకు కూలి, పైపులు తేలి కనిపిస్తున్నాయి. బోయినపల్లి పెట్రోల్‌ బంక్‌ పరిసరాల్లో ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలమై ఏళ్లు గడుస్తోంది. గతేడాది కురిసిన వర్షాలకు కల్వర్టు చివర్లలో పలుచోట్ల కుంగి కయ్యలు పడ్డాయి. ఇప్పుడు మరో గట్టి వర్షం కురిస్తే కల్వర్టు కూలే ప్రమాదం ఉంది.



కల్వర్టు కింద కూలి తేలిన పైపులు.. పైన వెళ్తున్న వాహనం

యాభై ఏళ్ల క్రితం సుమారు వంద మీటర్ల మేర నిర్మించిన ఈ కల్వర్టు కొన్నేళ్లుగా వర్షాలతో కల్వర్టు మీదుగా ప్రవాహం వెళ్లింది. కల్వర్టు కింద ఎప్పుడూ నీరు నిల్వ ఉండడంతో కట్టడం బలహీనపడి కింది భాగంలో పలుచోట్ల రాళ్లు ఊడిపోయాయి. స్లాబ్‌ కొట్టుకుపోయింది. ఐదేళ్ల క్రితం రూ.10 కోట్ల అంచనాలతో బోయినపల్లి నుంచి కొదురుపాక వరకు డబుల్‌ రోడ్డు నిర్మించిన సమయంలో హై లెవల్‌ బ్రిడ్జికి అధికారులు అంచనాలు వేసి ఉంటే కల్వర్టు పరిస్థితి ఇలా ఉండేది కాదు.

భారీ వాహనాల రాకపోకలు

కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ కల్వర్టుపై రోజూ భారీ లోడుతో గ్రానైట్‌, ఇసుక, కంకర లారీలు వస్తూ వెళ్తాయి. దీంతో కల్వర్టు చివర్లు కూలిపోయాయి. గతేడాది సెప్టెంబర్‌లో కొదురుపాక మీదుగా సిరిసిల్లకు వెళ్తున్న 25 టన్నుల ఆలుగడ్డ లోడ్‌తో ఉన్న లారీ కల్వర్టు చివర్లో దిగబడి ఒకవైపు వంగింది. దీంతో కల్వర్టు కింద ఉన్న రాతి కట్టడం కూలిపోయి కుంగింది. అపుడు భారీ ప్రమాదం తప్పింది. లారీని బయటికి తీయడానికి చాలా కష్టపడ్డారు. ఇలా కల్వర్టు పరిసరాల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెన శిథిలావస్థలో ఉంది. అనే బోర్డు పెట్టి వదిలేశారు.

నిధుల మంజూరు ప్రతిపాదనలకే

కల్వర్టు స్థానంలో హైలెవల్‌ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌ ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్‌ అధికారుల దృష్టికి గతేడాది తీసుకెళ్లారు. ఏడాది దాటినా నిధులు మంజూరు కాలేదు. ఇప్పుడు వర్షాకాలంలో వంతెన ఆగడం కష్టమే అంటున్నారు. కల్వర్టు మధ్యలో ఒకవైపు మొత్తం కుంగింది. దీంతో ఆ పరిసరాల్లోంచి వాహనాలు రాకపోకలు కొనసాగించకుండా కేవలం ఆకులు, చెట్ల కొమ్మలు అడ్డుగా వేశారు. స్థానిక ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ స్పందించి హైలెవల్‌ వంతెన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో తెల్వదు



కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు మధ్యలో ఒకవైపు సగం మేర కుంగి రోడ్డు మొత్తం డ్యామేజ్‌ అయ్యింది. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.

– నల్ల మోహన్‌, బోయినపల్లి

లోడు వాహనాలు నిషేధించాలి



బ్రిడ్జిపై అధిక లోడ్‌తో ఉన్న వాహనాల రాకపోకలు నిషేధించాలి. లేదంటే రాత్రివేళ వర్షం కురిసి వాహనాలు వెళ్తే అనుకోని ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కల్వర్టు ఒకవైపు కుంగి పూర్తిగా చెడిపోయింది.

– అలువాల అజయ్‌, బోయినపల్లి

హైలెవల్‌ బ్రిడ్జి నిర్మించాలి



లోలెవల్‌ వంతెన స్థానంలో హైలెవల్‌ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. కల్వర్టు ఎంట్రెన్స్‌లో పెద్ద కయ్యపడితే మొరంతో పూడ్చారు. మళ్లీ వర్షం పడితే అది కొట్టుకుపోయింది.

– ఎర్ర శ్రీకాంత్‌, నీలోజిపల్లి

ప్రతిపాదనలు పంపించాం



రూ.5 కోట్ల అంచనాలతో హైలెవల్‌ బ్రిడ్జి నిర్మాణానికి గతేడాది ప్రతిపాదనలు పంపించాం. వంతెన వద్ద హెచ్చరిక బోర్డు రాయించాం. కల్వర్టు పక్కనుంచి తాత్కాలిక దారి ఏర్పాటు చేస్తాం.

– ఆర్‌. సతీశ్‌, ఆర్‌అండ్‌బీ ఏఈ, బోయినపల్లి

సమాచారం

నేడు డబుల్‌బెడ్రూం ఇళ్ల కేటాయింపు

సిరిసిల్లటౌన్‌: డబుల్‌ బెడ్రూం ఇళ్ల డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు శనివారం నాలుగో విడతగా ప్లాట్స్‌ కేటాయిస్తున్నట్లు సిరిసిల్ల మున్సిపల్‌ కమిషన్‌ ఎం.డి.అయాజ్‌ ఒక ప్రకటనలతో తెలిపారు. ఉదయం సాయంత్రం 4 గంటలకు కార్యాలయంలో లబ్ధిదారులకు బ్లాక్స్‌, ప్లాట్స్‌ కేటాయింపు ప్రక్రియ నిర్వహిస్తున్నామని లబ్ధిదారులు ఎవరూ హాజరు కావొద్దని కోరారు. తదుపరి నోటీస్‌ బోర్డుపై లబ్ధిదారుల జాబితాను అంటించబడుతుందన్నారు.

ఐటీఐలో ప్రవేశాలు

తంగళ్లపల్లి: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2023–24, 25 సంవత్సరానికి వాక్‌ ఇన్‌ పద్ధతిలో ఆన్‌లైన్‌ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ జి.కనకయ్య ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నేరుగా ఆప్షన్‌ పెట్టిన ఐటీఐ కళాశాలకు ఈ నెల 20 నుంచి 23 తేదీ సాయంత్రం 5 గంటలలోపు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 96187 39916 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మోడల్‌ స్కూల్‌లో అడ్మిషన్లు

వీర్నపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌ పాఠశాలలో 2023–2024 విద్యా సంవత్సరంకు గాను మిగులు సీట్లకు దరఖాస్తులు చేసుకోవాలని శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్‌ విశ్వనాథం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6, 7, 8, 9 తరగతులు, ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మోడల్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించగలరని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ముస్తాబాద్‌: మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు. మండల పరిషత్‌ సమావేశ మందిరంలో ఎంపీపీ శరత్‌రావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆశీర్వాద సభకు తరలిన నాయకులు



వేములవాడ: సిరిసిల్లకు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు



ముస్తాబాద్‌: ఎల్లారెడ్డిపేట నుంచి తరలివెళ్తున్న నాయకులు



వేములవాడఅర్బన్‌: అగ్రహారం నుంచి..



తంగళ్లపల్లి: జిల్లెల్ల నుంచి బైక్‌ ర్యాలీ



బోయినపల్లి నుంచి..

వేములవాడ/వేములవాడఅర్బన్‌/ముస్తాబాద్‌/బోయినపల్లి/తంగళ్లపల్లి/కోనరావుపేట: జిల్లా కేంద్రంలో మెడికల్‌ కాలేజ్‌ ప్రారంభోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన కృతజ్ఞతా ర్యాలీ, సభలో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి శుక్రవారం పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు. వేములవాడ అర్బన్‌ మండలం అగ్రహారం, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల నుంచి బైక్‌ ర్యాలీ సిరిసిల్ల వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు, ఎంపీపీలు బూర వజ్రమ్మ, శరత్‌రావు, పర్లపల్లి వేణుగోపాల్‌, పడిగెల మానస, రేణుక, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్‌ జెడ్పీటీసీలు మ్యాకల రవి, నర్సయ్య, కత్తెరపాక ఉమ, లక్ష్మణ్‌రావు, సెస్‌ డైరెక్టర్లు హరిచరణ్‌రావు, అంజిరెడ్డి, కొట్టెపెల్లి సుధాకర్‌, కృష్ణహరి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షులు సురేందర్‌రావు, కత్తెరపాక కొండయ్య, గజభీంకార్‌ రాజన్న రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రావు, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పూర్మాని రాంలింగా రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వలకొండ వేణుగోపాల్‌రావు, సింగిల్‌విండో చైర్మన్‌ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ ఎలుసాని మోహన్‌, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నియామకం

కాంగ్రెస్‌ పార్టీ గ్రామ కమిటీలు

తంగళ్లపల్లి: కాంగ్రెస్‌ పార్టీ తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఇట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గుర్రాగొంది పోచయ్య, ప్రధానకార్యదర్శిగా ఉడుతల నరేందర్‌, సహాయ కార్యదర్శిగా నర్ర బాల్‌రెడ్డి, ముఖ్య సలహాదారుడిగా పబ్బతి లింగారెడ్డి, గీస కనకయ్యను ఎన్నుకున్నారు. సోషల్‌ మీడియా కన్వీనర్‌గా కందుకూరి మనోజ్‌కుమార్‌, యూత్‌ కమిటీ అధ్యక్షుడిగా శెట్టి నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా సొన్నాయిల రాజు, ప్రధాన కార్యదర్శిగా మెడుదుల కుమార్‌, మైనార్టీ సెల్‌ అధ్యక్షుడిగా ఎండీ సర్దార్‌, ప్రధాన కార్యదర్శి ఎండీ సలీమ్‌ను ఎన్నుకున్నారు.

కౌండిన్య గౌడ యువసేన కార్యవర్గం

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ కౌండిన్య గౌడ యువసేన నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బత్తిని కమల్‌, ఉపాధ్యక్షుడిగా ఉయ్యాల అనీల్‌కుమార్‌, ప్రధానకార్యదర్శిగా ఉయ్యాల తిరుపతి, కోశాధికారిగా చింతలకోటి మహేశ్‌, కార్యదర్శిగా చింతలకోటి పర్శరాములు, కార్యవర్గసభ్యులుగా ఉయ్యాల శేఖర్‌, బాలాజీ, నవీన్‌, బండారి మహేందర్‌, చింతలకోటి మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌

ముస్తాబాద్‌: ముస్తాబాద్‌ పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్‌, సంఘం నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతూ అంగన్‌వాడీల నిరసన

సిరిసిల్లటౌన్‌: ఉద్యోగాలు రెగ్యులరైజ్‌ చేయాలంటూ నిరవధిక సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీలు శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వినూత్న తరహాలో నిరసనలు హోరెత్తించారు. బతుకమ్మ ఆటలు, ప్రదర్శనతో ప్రభుత్వ తీరును వ్యతిరేకించారు. ఈ సందర్భంగా జిల్లా అంగన్‌వాడీ టీచర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ అధ్యక్షురాలు కల్లూరి చందన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ కల్పించాలని, ప్రతి టీచర్‌కు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, కొండికొప్పుల పద్మ, శ్యామల, అంజలి, మహేశ్వరి, వాణి, సునీత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న అంగన్‌వాడీలు

విజయభేరి సభకు తరలిరండి

తంగళ్లపల్లి/ముస్తాబాద్‌: సెప్టెంబర్‌ 17న సోనియాగాంధీ అధ్యక్షతన జరిగే విజయభేరి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్‌ తంగళ్లపల్లి, ముస్తాబాద్‌ మండల అధ్యక్షులు జాలగం ప్రవీణ్‌టోని, యెల్ల బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయా మండల కేంద్రాల్లో వేర్వేరుగా విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడారు. మంత్రి కేటీఆర్‌పై పలు విమర్శలు చేశారు. డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌, నాయకులు గుగ్గిళ్ల శ్రీకాంత్‌ గౌడ్‌, మునిగెల రాజు, అరెపల్లి బాలు, భరత్‌, ఎంపీటీసీ శ్రీనివాస్‌, ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు నర్సింలు పాల్గొన్నారు.

తిరిగొచ్చిన జంపిరెడ్డి

ముస్తాబాద్‌: రెండు రోజుల క్రితం రాజన్న దర్శనానికి వెళ్లి అదృశ్యమైన యువకుడు ఎట్టకేలకు ఇంటికి చేరుకున్నాడు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన జంగ జంపిరెడ్డి(32) ఈనెల 12న వేములవాడ రాజన్న దర్శనం కోసం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి చేరకపోవడంతో కుటుంబీకులు ఆందోళనకు గురై, ఆయన కోసం గాలించిన ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కోసం పోలీసులు ఆరా తీస్తుండగా శుక్రవారం ఇంటికి చేరుకున్నాడు. వేములవాడ నుంచి నేరుగా హైదరాబాద్‌కు వెళ్లినట్లు తెలిపాడు. నాలుగు రోజులకు జంపిరెడ్డి ఇంటికి క్షేమంగా చేరడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

సమస్యలను పరిష్కరించండి



గణేశుడి ఊరేగింపులో పాల్గొన్న చల్మెడ

వేములవాడ: చందుర్తి మండలం జోగాపూర్‌, గుడిపేటకు చెందిన 50 మంది శుక్రవారం బీఆర్‌ఎస్‌ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును కలుసుకుని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మంత్రి కేటీఆర్‌తో చర్చించి ఈ ప్రాంత సమస్యల పరిష్కారం, రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం రాజన్న యూత్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే గణనాథుని ఊరేగింపు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లి, రామన్నపేట గ్రామాలకు చెందిన బూర్గు ప్రవీణ్‌, రామంచ సుధాకర్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌ నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరినట్లు బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఏఎంసీ వైస్‌చైర్మన్‌ చిక్కాల సుధాకర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు అభినందన



బోయినపల్లి: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా నియమితులైన బీ.గౌతంరెడ్డిని, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్‌ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్‌ఎంపీపీ నాగయ్య, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, జూలపల్లి అంజన్‌రావు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

బోయినపల్లి: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించే సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాన్ని సీపీఎం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్‌ గురజాల శ్రీధర్‌, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడికి ఇంటి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్‌

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్‌ గ్రామపంచాయతీలో కొన్నేళ్లుగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పసుల కనుకయ్యకు ఇల్లు లేకపోవడంతో సర్పంచ్‌ గొడిసెల జితేందర్‌గౌడ్‌ తన సొంత ఖర్చులతో ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్వప్న, ఉపసర్పంచ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో సిబ్బందిని పెంచాలి

సిరిసిల్లటౌన్‌: జిల్లా ఆసుపత్రిలో పడకలకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్‌ చేశారు. శుక్రవారం ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్‌, పేషెంట్‌కేర్‌, సెక్యూరిటీ గార్డ్స్‌ సిబ్బందితో కలిసి నిరసన చేపట్టి మాట్లాడారు. ఆయా విభాగాల్లో సిబ్బందిని పెంచకపోవడం మూలంగా కార్మికులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు ఆస్పత్రి అధికారులకు విన్నవించినా స్పందించడం లేదన్నారు. సిబ్బంది పెంపుపై అంబేద్కర్‌ చౌరస్తాకు విచ్చేసిన మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కార్మికులు నాగమణి, దేవరాజు, పద్మ, తిరుపతి, లత, అంజయ్య, మునీర్‌, రేవతి పాల్గొన్నారు.



జిల్లా ఆస్పత్రి ఎదుట కార్మికుల నిరసన

సంక్షిప్త వార్తలు

కొమురయ్య మృతిపై దిగ్భ్రాంతి

వేములవాడ: వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలోని రుద్రంగి మండల కేంద్రానికి చెందిన వెంగళ కొమురయ్యగౌడ్‌ శుక్రవారం గుండెపోటుతో మరణించడంపై రాష్ట్ర ప్రజాశిల్కా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కొమురయ్యగౌడ్‌ వినూత్న కార్యక్రమాలతో ఉద్యమానికి ఊపు తెచ్చారని గుర్తు చేశారు. కొమురయ్యగౌడ్‌ కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అర్హులకే ఇళ్లు కేటాయించాం

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ఇళ్లు లేని 20 మంది అర్హులైన లబ్ధిదారులకే డబుల్‌ బెడ్రూం ఇళ్లను కేటాయించినట్లు సర్పంచ్‌ కేతిరెడ్డి తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

పేద ముస్లింలకు అండగా నిలవాలి

ముస్తాబాద్‌: మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సయ్యద్‌ షరీఫ్‌ను ఎల్లారెడ్డిపేట మసీద్‌ కమిటీ సభ్యులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో సదర్‌ ఆయూబ్‌, ఆలీ, హాజీబాబా, యామిన్‌ బాష, ఖాజా, రఫీక్‌ పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు

ముస్తాబాద్‌: ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్‌ కళాశాల విద్యార్థులకు గుర్తింపు(ఐడీ) కార్డులను శుక్రవారం అందజేశారు. కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు బోడ ప్రశాంత్‌, శంకర్‌, ప్రదీప్‌ రూ.10వేల విరాళంతో ఐడీ కార్డులను తయారు చేశారని ప్రిన్సిపాల్‌ సత్యనారాయణ తెలిపారు.

పోలీసుల తనిఖీలు

కోనరావుపేట: మండలంలోని మర్తనపేట క్రాసింగ్‌ వద్ద ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. వాహనదారుల పత్రాలను పరిశీలించారు. పత్రాలు సరిగాలేని వాహనదారులకు జరిమానాలు విధించారు.

రెండు తలల దూడ జననం

చందుర్తి: మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన రోకండ్ల రవీందర్‌రావుకు చెందిన గేదెకు రెండు తలల దూడ జన్మించింది. కోరుట్ల వెటర్నరీ ఆసుపత్రి తరలించారు. పరిస్థితి విషమించి దూడ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఒకే ఒక్కడు

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్‌ కార్యాలయంలో శుక్రవారం సూపరింటెండెంట్‌ విజేందర్‌రెడ్డి మాత్రమే విధులు నిర్వహించగా మిగతా అధికారులు ఎవ్వరూ అందుబాటులో లేరు. ఎంపీడీవో హైదరాబాద్‌కు ట్రెనింగ్‌కు వెళ్లగా, సీనియర్‌ అసిస్టెంట్‌ ఆరు నెలలుగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఉన్న ఒక్కగానొక్క జూనియర్‌ అసిస్టెంట్‌కు టెట్‌ పరీక్ష డ్యూటీ వేయడంతో కార్యాలయం మొత్తం బోసిపోయింది.

ఎమ్మెల్యే పరామర్శ

బోయినపల్లి: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని మాన్వాడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్త జనగం బాబు కుటుంబాన్ని శుక్రవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ పరామర్శించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఐరెడ్డి మల్లారెడ్డి ఉన్నారు.